కథానిక

# పెళ్లిలో రాజకీయాలు

అంగర సూర్యారావు

"అదిగో! ఆ కిటికీముందు నిలబడుతుంది. నావేపు చూస్తుంది. ఆమె చూపులకి నాలో నిద్రపోతున్న కోరికలేవో మేల్కొంటాయి. ఆ చూపుల్ని భరించలేకపోతున్నాను. అయినా ఆమె ఒకరోజు కనిపించకపోతే దిగులుగా వుంటుంది. ఆమె..."

"ఇంతకూ ఆమె కనిపించదేం? ఆ కిటికీ తలుపులు మూసివున్నవేం?" మధ్యలో అందుకొని అడిగాడు శ్యాం.

"ఇప్పుడు వచ్చిపడిన ఆపద అదేరా!" అన్నాడు సుదర్శనం.

ఓహో! వీడు మహత్తరమైన ప్రేమవాహినిలోపడి కొట్టుకుపోతున్నాడని వూహించాడు శ్యాం.

"నీలాంటి యువకులు యిటువంటి చిన్న విషయాలకు నిరుత్సాహపడడం మంచిదికాదురా సుదర్శనం. యింతవరకూ జరిగిన కథేమిటో చెబితే జరగబోయే కథను సవ్యంగా నడిపించడానికి శ్రమపడదాం" అని ఓదార్చాడు శ్యాం.

ఒక నిట్టూర్పు విడిచి తిరిగి చెప్పడానికి ఉపక్రమించాడు సుదర్శనం.

"వాళ్లు ఆ యింట్లోకివచ్చిన నెలరోజులనుంచీ ఆమె ఆ కిటికీదగ్గర కనిపిస్తూనేవుంది. మర్యాదగా వుండదని భయపడి మొదటి వారంరోజులవరకూ ఆమెకేసి చూడడానికి సంకోచించేవాణ్ణి. తరవాత ఆమెకులేని సంకోచం నాకెందుకని తలచి నిర్భయంగా ఆమెవైపు చూడ్డం ప్రారంభించాను." క్షణం ఆగి "అలా చూడ్డంలో ఏమైనా తప్పుందంటావా?" సూటిగా అడిగాడు.

"నువ్వు యువకుడివి. బ్రహ్మచారివి. నీకు చూసే హక్కు పూర్తిగా వుంది" సమర్థించాడు శ్యాం.

"నాకుగల హక్కును అందరూ గుర్తిస్తారు కాని వాళ్లనాన్నమాత్రం గుర్తించలేకపోయాడు. నిన్న మా యిద్దరి కథా పసికట్టి ఆ కిటికీతలుపులు మూసేశాడు. దానితో నా ఆశలన్నీ నిరాశలై పోయినాయి" నిరుత్సాహంగా అన్నాడు సుదర్శనం.

"నీమీద ఆమెకు ప్రేమ వున్నదీ లేనిదీ తెలుసుకోవడానికి ఇది మంచి పరీక్ష. ఆమెకు నిజంగా నీమీద ప్రేమవుంటే ఏదో ఉపాయంవల్ల నిన్ను తప్పకుండా చూడ్డానికి ప్రయత్నిస్తుంది. ఆమె నీవైపు తిరిగిచూసిన వెంటనే మనం తర్వాత కార్యక్రమానికి ఉపక్రమిద్దాం" అన్నాడు శ్యాం.

"సరే, చూద్దాం!" అన్నాడు సుదర్శనం.

శ్యాం వెళ్ళిపోయాడు. సుదర్శనం ఒంటరిగా దిగులుగా మూసిన కిటికీవైపు చూస్తూ కూర్చున్నాడు. అతని బుర్రలో రకరకాల ఆలోచనలు ప్రవేశిస్తున్నై. పాడులోకం! యీ లోకంలో ఒకరి ఆనందాన్ని మరొకరు చూసి సహించలేరు కదా!

మర్నాడుకూడా తలుపులు తెరవబడలేదు. అతను నిరాశతో క్రుంగిపోయాడు యింతవరకూ అతని ఊహాపథంలో కనిపించిన ఉద్యానవనాలు, పూలపాన్పులు, రమ్యహర్మ్యాలు చెరిగిపోసాగినై, యిక అతనికి ఆ యింట్లో వుండడం నిప్పులమీద నిలిచినట్లు బాధగావుంది. గదికి తాళంవేసి శ్యాం లాడ్జికి వెళ్ళాడు.

ఇద్దరూ కలిసి బీచిలో కూర్చున్నారు. సముద్రం మీదినుంచి వచ్చే చల్లనిగాలి మనసులోని సంకోచాన్ని పోగొట్టి నూతనోత్సాహాన్ని కలిగిస్తోంది.

"ఆమె తప్పక నావైపు చూస్తుందనే నమ్మకం నాకు వుంది" అన్నాడు సుదర్శనం.

"తిరిగిచూస్తే మన సంశయం పూర్తిగా తొలిగిపోయినట్లే"

"ఆ తరువాత ఏంచేద్దాం?"

"ఓ చక్కని ప్రేమలేఖ రాసి పంపుదాం."

ఈ సలహా సుదర్శనానికి నచ్చింది. యిద్దరూ ఆ రాత్రి మామూలుగా హోటల్లో భోజనంచేసి సుదర్శనం లాడ్జిలోనే పడుకున్నారు.

సూర్యుడి లేత కిరణాలు కిటికీలోంచి వచ్చి వాళ్ళమీద పడుతున్నై. సుదర్శనం సుందర స్వప్నంలోంచి మేల్కొని కళ్లు తెరచి చూసే సరికి తిన్నగా వున్న కిటికీ స్వర్గద్వారంలా తెరిచి వుంది.

"శ్యాం! శ్యాం! లే! అదుగో ఆ కిటికీతలుపులు తెరుచుకున్నాయి."

శ్యాం ఉలికిపడి కళ్లుతెరిచి చూశాడు. తెరిచిన కిటికీ కనిపించింది. ఓ సర్వాంగ సుందరి ఆ కిటికీకి తిన్నగా నుంచునివుంది. ఆమె వైపు చూపిస్తూ "అదుగో! మనోరమ" అన్నాడు సుదర్శనం.

"ఆమె పేరు మనోరమా?" ప్రశ్నించాడు శ్యాం. "ఏమో నాకు తెలీదు. ఆమెను చూస్తే నా మనసుకు ఆనందం కలుగుతుంది గనక ఆమె పేరు మనోరమ అయివుంటుందనుకున్నాను."

"ఆ పేరు ఆమెకు సరిగా సరిపోయింది."

మనోరమ మరో చిరునవ్వు విసిరి వెళ్ళిపోయింది. యిద్దరూ కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ తాగి ప్రణయలేఖా రచనకు ఉపక్రమించారు.

"ప్రియమైన మనోరమా..." శ్యాం చెప్పడం ప్రారంభించాడు.

"అలా సంబోధించవద్దు. ఆమె అసలు పేరు మనకు తెలీదు."

"అయితే యిలా ప్రారంభిద్దాం" క్షణం ఆలోచించి శ్యాం తిరిగి చెప్పడం ప్రారంభించాడు. సుదర్శనం కాగితం తీసి రాస్తున్నాడు.

"సుందరీ!

నిన్ను చూసేకొద్దీ నా మనసు కలవరపడుతోంది. నీతో స్వయంగా కొన్ని విషయాలు మాట్లాడడానికి ఉత్సాహిస్తున్నాను. నీ జాబు కోసం ఎదురుచూస్తాను."

"ఇక చాలు" అన్నాడు సుదర్శనం.

ఇంతలో కొంపలు కాలుతూవుంటే అర్పడానికి వచ్చినవాళ్ళలా యిద్దరు యువకులు గదిలో ప్రవేశించారు. ఇద్దరి బట్టలూ చెమటతో తడిసిపోయి వున్నాయి. వాళ్లముఖాలలో ఆత్రుత కనిపిస్తోంది. అందులో ఒక యువకుడు ఉపన్యాస ధోరణిలో చెప్పడం ప్రారంభించాడు.

"సోదరులారా! లేవండి! భావిపౌరులమైన మనం యిలా మూల కూర్చుని వుండడం అరిష్టం. మన విద్యార్థులకు ఘోరమైన అన్యాయం జరుగుతూ వుంటే మనం చూస్తూ వూరుకోవడం మంచిది కాదు. లేవండి. లేవండి. వూరేగింపులో పాల్గొనండి..."

"అసలు జరిగినదేమిటో చెప్పు?" అన్నాడు శ్యాం.

ఆ యువకుడు ఉపన్యాసాన్ని కొనసాగించే ధోరణిలో "మనం విద్యార్థులమైనంత మాత్రాన రాజకీయాలలో పాల్గొనరా దనడం ఘోరం! రాజకీయాలలో పాల్గొనడం మన జన్మహక్కని మనం చాటాలి. ప్రతి రాజకీయ సంఘటన మనం తెలుసుకోవాలి. కొరియాయుద్ధం — బెరియా పతనం — కొలంబో సమావేశంలో పాకిస్తాన్ పాత్ర—విజయలక్ష్మి పండిట్ విదేశ యాత్ర-సర్వం మనం తెలుసుకోవాలి. క్షుణ్ణంగా చర్చించాలి. మనం రాజకీయ పరిజ్ఞానం బాగా సంపాదించాలి. మనలో "

"మీరు వచ్చిన పనేమిటో చెప్పవయ్యా మహానుభావా! ఇప్పుడు మీ ఉపన్యాసం వినే తీరిక మాకులేదు." అన్నాడు సుదర్శనం.

ఆయువకుడు అతనిమాట వినిపించుకోకుండా తిరిగి ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, "మనలో యెందరో రాజకీయవేత్తలు, మహామేధావులూ వున్నారు. అటువంటప్పుడు మనంమౌనంవహించి వూరుకోగలమా? రాత్రి బీడీ కార్మికుల సమ్మెసందర్భంలో జరిగిన బహిరంగసభలో మన విద్యార్థులకు పోలీసులకు తీవ్రమైన ఘర్షణ జరిగింది. పోలీసులు లాఠీచార్జీ చేశారు. పదిమంది విద్యార్థులకుతీవ్రమైన గాయాలు తగిలాయి. పోలీసు జులుంకు వ్యతిరేకంగా జరిగే నేటి ప్రదర్శనలో ప్రతి విద్యార్థీ పాల్గొనాలి."

"సరే! అలాగే పాల్గొంటాం. వెళ్ళండి." వాళ్ళను ఎలాగోలా వదిలించుకునే ఉద్దేశంతో అన్నాడు సుదర్శనం.

వెంటనే రెండవ యువకుడు అందుకుని, "మన విద్యార్థిసంఘం బలపడాలంటే ప్రతివిద్యార్థీ విధిగా చందా యివ్వాలి. మీ చందా వెంటనే యిందులో వెయ్యండి." చేతిలోనిడబ్బా ముందుకు చాపాడు.

సుదర్శనం ఒక రూపాయితీసి డబ్బాలోపల వేశాడు.

"మిగిలిన విద్యార్థులందరికీ యీ విషయం వెంటనే తెలియజెయ్యాలి. మీరుకూడా మీకు కనిపించిన వాళ్ళందరికీ యీవిషయం చెప్పండి."

ఆ యిద్దరు యువకులూ ఎంత తొందరగా ప్రవేశించారో అంత తొందరగా నిష్క్రమించారు.

"హాయిగా చదువుకొని ఒకచోట పడివుండక ఎందుకు ఇంత హడావిడి చేస్తారువీళ్ళు!" అన్నాడు సుదర్శనం.

"వాళ్ళదొక వెర్రి. యీ తరహా మనుషులు చివరకు ఎందుకూ పనికిరాకుండా పోతారు చూడు!" అన్నాడు శ్యాం.

"పట్టిస్తూల్సు!—యిక వాళ్ళమాటకేం. మన ఉత్తరం ఆమెకు అందే విధానం యేమిటి?" అన్నాడు సుదర్శనం.

"దానికేముంది! మీ పనిమనిషితో పంపించేద్దాం!"

ఆ సూచన సుదర్శనానికి నచ్చింది. వెంటనే పనిమనిషిని పిలిచి ఉత్తరం యిచ్చాడు. ఇద్దరూ ఊపిరి బిగించి జరగబోయే సంఘటనకోసం ఎదురు చూస్తున్నారు. పనిమనిషి చేతిలోంచి ఆమె ఉత్తరం తీసుకోవడం వాళ్ళు చూశారు. ఆమె ఉత్తరం వైపొకసారి, అతనివైపు ఒకసారి చిరునవ్వుతో చూసి లోనికి వెళ్ళిపోయింది. చీకటితో నిండిన అతని హృదయంలో వెయ్యిజ్యోతులు ఒకేసారి వెలిగించినట్లయ్యింది.

"యికనువ్వు క్షేమకు అవతలి ఒడ్డు చేరుకున్నావు" అన్నాడు శ్యాం.

"ఆమెనుంచి మనకు జవాబు రావద్దూ?"

"వస్తుంది చీకటి రెండు రోజులలో!"

ఆమె జవాబుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు సుదర్శనం. ఆ రోజు గడిచిపోయింది.

మర్నాటి ఉదయం అతను లేచేసరికి చాలా ఆలస్యమయింది. కాఫీతాగి దిగులుగా కుర్చీలో కూర్చున్నాడు. శ్యాం ఇంకారాలేదు. ఎదరింటిలోంచి పాట శ్రావ్యంగా వినిపిస్తోంది.

కిటికీ తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నాయ్. తిన్నగా ఆమె కనిపించింది. ఆమె ముఖంలో ఏదో దిగులు భయం వున్నట్లు తోచింది. సుదర్శనానికి. వాళ్ళనాన్న పెద్ద ఉద్యోగికదా యింకా ఆమెకు పెళ్ళెందుకు చెయ్యలేకపోయాడు? ఇంత అందమైన యువతిని పెళ్ళి చేసుకోవడానికి ఏ యువకుడు వెనకాడతాడు? పాపం! ఈమె తనను ఒక క్షణంకూడా చూడకుండా వుండలేదు. ఇటువంటి సర్వాంగ సుందరితో నిర్జన సముద్ర తీరంలో నిండు వెన్నెలలో ఒక్కసారి తిరగ గలిగితే యిక జీవితంలో కావలసిందేముంది? కాని...కాని...తన కోరిక తీరుతుందా?

ఇంతలో బూటు చప్పుడుకు అతను వెనక్కి తిరిగి చూశాడు. అతనికి గుండె ఆగినంతపని జరిగింది. లావుగా పొడవుగావున్న ఆ వ్యక్తిని చూడగానే ఆమె తండ్రి అని తెలుసుకున్నాడు. అతని ముఖం కోపంతో ఎర్రబడివుంది. అతను సుదర్శనం ఆహ్వానానికి ఎదురు చూడకుండానే కుర్చీ-అతనికి దగ్గరగా లాగి కూర్చుని జేబులోంచి నోటుబుక్, కలం తీశాడు.

"నీ పేరు?" ఉరిమినట్లు గర్జించాడు.

"ఎం. సుదర్శనరావు" తడబడుతూ చెప్పాడు.

అతను పుస్తకంలో రాసుకుంటున్నాడు.

"వూరు?"

"భీమ్లి"

"నీ వయస్సు?"

"ఇరవైనాలుగు సంవత్సరాలు."

"తండ్రిపేరు?"

"రంగనాథంగారు."

"నీ వృత్తి?"

"చదువుకుంటున్నాను."

"నువ్వు ఎప్పుడూ కాలేజీకి వెళ్ళినట్లు కనిపించందేం?" రాత ముగించి నోట్ బుక్, పెన్ జేబులో పెట్టుకుంటూ ప్రశ్నించాడు.

"మిగిలిపోయిన పార్టు రెండేళ్ళనుంచి యీ గదిలోవుండే చదువుతున్నాను."

"నువ్వు కాలేజీలో చదువుకుంటున్నప్పుడు నీకేమైనా శిక్షలు తగిలాయా?"

"లేదు!" అనేశాడు నిస్సంకోచంగా! కాని ఒకసారి ఒక అమ్మాయి చీరమీద సిరా పోసినందుకు వారంరోజులు తనని కాలేజీనుంచి సస్పెండుచేసిన ఘట్టం అతనికి జ్ఞప్తికి వచ్చింది. ఆ విషయం యీయనకు చెబితే కొంప మునిగిపోదూ?

"నీకు రాజకీయాలలో ఏమైనా ప్రవేశం వుందా?"

"నాకు రాజకీయాలంటేనే తలనొప్పి!" ఇది నిజంగా నిజం. అతను యింతవరకూ రాజకీయాల జోలికి పోనేలేదు.

"సరే! ఇక అసలు విషయానికి వద్దాం. ఈ ఉత్తరం మా అమ్మాయికి నువ్వు రాసిందేనా?" జేబులోంచి ఉత్తరం తీసి చూపించాడతను. ఆ ఉత్తరం చూసేసరికి సుదర్శనానికి ముచ్చెమటలు పోశాయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"అది... నేను..." ఏదో చెప్పబోయాడు.

"అదంతా నాకు అనవసరం. ఇది నువ్వు రాసింది అవునా కాదా?" గర్జించాడు.

"నేనే రాశాను!" అన్నాడు గత్యంతరంలేక.

"అదే నాకు కావలసిన జవాబు" అని ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా జేబులో పెట్టుకొని ఆయన అక్కడినుంచి సీరియస్‌గా వెళ్ళిపోయాడు.

ఇంతటి మహావిపత్తు మీద పడుతుందని సుదర్శనం ఎన్నడూ వూహించలేదు. ప్రణయంలోంచి ప్రళయం పుట్టుకువచ్చింది. ఇక ఇప్పుడు తను చెయ్యకలిగిందేమిటి? వేగంగా సూట్‌కేస్‌లో బట్టలు సర్దాడు. బెడ్డింగుచుట్టే సమయంలో శ్యాం వచ్చాడు.

"ఎక్కడికిరా ప్రయాణం?" అన్నాడు ఆశ్చర్యంగా. "నీ వెధవసలహా విని ఆమెకు ప్రణయలేఖరాసి ప్రాణంమీదికి తెచ్చుకున్నా." అన్నాడు కోపంగా.

"యిప్పుడేం జరిగింది?"

"ఏం జరగకూడదో అదే జరిగిపోయింది. మన ప్రణయలేఖ మనోరమ నాన్నకు దొరికిపోయింది. ఆయన నిప్పులు కక్కుతూ ఇక్కడకు వచ్చి నాపేరు, మా నాన్నపేరు, మా వూరు పేరు అన్నీ రాసుకుపోయాడు."

"రాసుకుపోతే యిప్పుడు మనకేం నష్టం?"

"నష్టమా? పరువునష్టం దావా వెయ్యవచ్చు. కాలేజీనుంచి డిబార్ చేయించవచ్చు. యింకా యేమైనా చేయించవచ్చు."

"ప్రస్తుతం పెట్టె బెడ్డింగు సర్దుకోవలసిన అవసరం ఎందుకు వచ్చింది?"

"నాకు యిక యీ యింట్లో వుండడం యిష్టం లేదు. సాయింత్రానికి ఎక్కడో చోట మంచి రూమ్‌చూడు."

"తక్షణం రూంకావాలంటే ఎక్కడ దొరుకుతుంది? నీకంత భయంగావుంటే నీ రూమ్‌కు తాళంవేసి నా లాడ్జిలో కొన్నాళ్లు వుండు."

ఆ సలహా సుదర్శనానికి నచ్చింది. యిద్దరూ బయటకువచ్చి రూమ్‌కుతాళంవేశారు. ఆకస్మికంగా ఎదరింటి కిటికీవైపు చూపిస్తూ—

"అదుగోరా మనోరమ!" అన్నాడు శ్యాం. కోపంతో పళ్లుబిగించి "యిక ఆ విషయం నా దగ్గర ఎత్తకురాబాబూ!" అన్నాడు సుదర్శనం.

ఆ యిద్దరూ—బెడ్డింగు ఒకళ్లు, సూట్‌కేసు ఒకరు భుజంమీద వేసుకొని—కాందిశీకులలా ఆ రూంవిడిచిపెట్టి బయలుదేరారు.

నాలుగు రోజులతర్వాత శ్యాం లాడ్జిముందు ఓ జట్కా ఆగింది. ఆ జట్కాలోంచి ముందు మనోరమ నాన్నదిగాడు. కిటికీలోంచి యిది గమనిస్తున్న సుదర్శనం "నేను ఎవరికీ కనిపించని చోటు ఎక్కడైనా దాక్కోవాలిరా శ్యాం!"

"జరిగేదెలాగూ జరగకమానదు. ధైర్యంగా వుండు." హెచ్చరించాడు శ్యాం.

బండిలోంచి దిగిన రెండవవ్యక్తి సుదర్శనం నాన్న. తండ్రిని చూసేసరికి సుదర్శనానికి మిగిలిన కొంచెం ధైర్యం చెదిరిపోయింది.

"నీకోసం ఉదయంనుంచి వెతుకుతున్నాంరా! ఆ గదిలో ఎందుకు వుండడంలేదు?" అన్నాడు సుదర్శనం తండ్రి రంగనాధం.

"ఎలావుంటాడు? మొఖం చెల్లవద్దూ?" అన్నాడు మనోరమ నాన్న. 'అతనిమాటలు ఎంత కర్కశంగా వుంటాయి.' అనుకున్నాడు

సుదర్శనం. యిప్పుడువచ్చిన కొత్త ఆపద యేమిటో అతనికింకా బోధపడలేదు.

శ్యాం కుర్చీలు తీసుకువచ్చి వేశాడు. ఇద్దరు పెద్దమనుషులూ న్యాయమూర్తులలాగా ఠీవిగా కుర్చీలమీద కూర్చున్నారు. సుదర్శనం, శ్యాం నేరస్థులలా ఓ ప్రక్కని నిలుచున్నారు.

మనోరమనాన్న రంగానాథంతో అన్నాడు: "చూడండీ! యీ కాలపు పిల్లలున్నారే అందరూ రాజకీయాలలో తిరిగేవాళ్ళే. అలాంటి కుర్రాడు నాకు అల్లుడైతే నా ఉద్యోగానికి ముప్పురావచ్చు. అదీకాక నాకు రాజకీయాలంటే తగని అసహ్యం. ముఖంమీద పొగడ కూడదు కానీ మీ అబ్బాయి నిజంగా చాలా బుద్ధిమంతుడు. తోటి విద్యార్థులంతావచ్చి బలవంతంచేసినా రాజకీయసభలలోకి వెళ్ళడు. రెండు నెలలనుంచి జాగ్రత్తగా నేను మీ అబ్బాయిని కనిపెడుతున్నాను. యిన్నాళ్లకు నాకుతగిన అల్లుడు దొరికాడని సంతోషించాను." అన్నాడు.

"రారా సుదర్శనం! పెళ్ళికూతుర్ని చూసి వద్దువుగాని." అన్నాడు రంగనాథం.

"వాళ్ళు చాలాకాలంనుంచి చూసుకుంటున్నారు. యిక చూడవలసింది మీరే!" అన్నాడు మనోరమ నాన్న.

రంగనాథం మనోరమ నాన్నతో పెళ్ళికూతుర్ని చూడ్డానికి వెళ్ళాడు. సుదర్శనం శ్యాంతో హోటలుకు వెళ్ళాడు.

స్కెచ్

# మేడనీడ

విశ్వమిత్ర

ఆ మూడంతస్థుల మేడకి తూర్పున సూర్యుడూ, పడమర వెంకడూ ఎందులోనో పోటీ పడ్డట్టు ఎవరి పనిమీద వాళ్లున్నారు. సూర్యుడు వేగంగా పైకి లేస్తున్నాడు. వెంకడు తను పడుకున్న కుక్కిమంచంలోంచి పైకి లేవటానికి ప్రయత్నించకపోయినా సూర్యుడి వేగంకంటే ఏమాత్రం తీసిపోని వేగంతో ఆలోచిస్తున్నాడు. ఆ మేడనీడని సూర్యుడు సుమారు ఓ అరఫర్లాంగు దాకా సాగదీసి మళ్ళీ క్రమంగా, ఆ మూడంతస్థుల మేడనీ, దానికంటే చిన్నదిగా నీడని తయారుచేయటానికి చేసే ప్రయత్నంలో మునిగిపోయాడు. అప్పుడప్పుడు చిన్న చిన్న మేఘాలు అడ్డం వొస్తున్నయ్. వాటిమీంచి తలెత్తి, మేడ నీడ ఎంత పొట్టయిందోనని పరీక్షగా చూస్తున్నాడు సూర్యుడు. వెంకడు ఆలోచిస్తూనే వున్నాడు. ఆ మూడంతస్థుల మేడనీ ఒక్కకంటిలో ఇమిడ్చి చూస్తున్నాడు. మూడంతస్థుల మేడ ప్రతి అంతస్థునీ విడదీస్తూ ఒక చూరు ముందుకు పొడుచుకొచ్చింది. ఆ మేడకి పడమరగా వున్న తన వొంటి నిట్టాడి గుడిసె ఎత్తు మొదటి అంతస్థు చూరుకి సమానంగా వుంది. అందుకని వెంకడికి ఆమూడంతస్థుల మేడ పూర్తియెత్తు స్పష్టంగా తెలుసు. తన గుడిసెమీద ఇంకా అట్లాంటి రెండు గుడిసెలు నిలబెడితే ఎంతఎత్తో ఆ మేడ అంత ఎత్తు అన్నమాట. వెంకడికి తన ఆలోచన్లు చూసి నవ్వొచ్చింది. గుడిసెమీద గుడిసె నిలబెట్టడమేమిటి? ఇదేం లెక్క? వెంకడికి అకస్మాత్తుగా ఒకదానిమీద ఒకటి నిలబెట్టిన మూడు గుడిసెలూ కూలినట్టనిపించింది.

కుక్కిమంచంలోంచి నేలని తగులుతాను, అని బెదిరిస్తున్న నడుముని వెంకడు బలవంతంగా కొంచెం పైకి లేవనెత్తి, మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు. తన ఊహాపథంలో నిర్మించుకొన్న మూడు గుడిసెలూ కూలిపోవటంలో వెంకడికి మరింత నిరుత్సాహం కలిగింది. తను కనీసం ఒక తాపీవాడుగానన్నా పుట్టలేదేం? మూడంతస్థులు కట్టినా ముప్పై అంతస్థులు కట్టినా తాపీవాడే నిజంగా. ఆ ఇంటి యజమానికంటేకూడా తాపీవాడే గొప్పవాడా? వెంకడి ఆలోచనలే దానికీ సమాధానం చెప్పినయ్. కాదని ఎందుకు? వెంకడికి మళ్ళీ అనుమానంవేసింది. తాపీవాడు, ఎంత ఎత్తు కట్టినా ఆ మేడకి తక్కున నేలమీద నుంచి కర్రలుపాతుకుని పరజాలు కట్టి కట్టాల్సిందేగానీ, ఆ మేడమీద, కనీసం ఆ కాసేపన్నా కూర్చునే అధికారంలేదు. ఇంకా ఆ లెక్కన ఆలోచిస్తే ఆ ఇంట్లో పనిచేసే పనిమనిషి కొంత